మమత-సమత-మానవత
www.gurajada.org

# ప్రకాశిక

గురజాడ ఫౌండేషన్ (అమెరికా) వారి
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపకులు కీ.శే. గురజాడ
వేంకట అప్పారావు గారు
www.prakasika.org

**వ్యవస్థాపక సంపాదకులు**
కీ.శే. శ్రీ గురజాడ వేంకట అప్పారావు

**ప్రధాన సంపాదకులు**
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ

**గౌరవ సంపాదకులు**
శ్రీ మా శర్మ

**నిర్వాహక సంపాదకులు**
శ్రీమతి గురజాడ అరుణ

**సంపాదక సలహాదారులు**
శ్రీ గురజాడ రవీంద్రుడు, శ్రీ విహారి,
ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య గుమ్మా సాంబశివ రావు

**శీర్షిక సంపాదకులు**
**వనితా ప్రకాశిక:** డా. సి. భవానీదేవి; **కళా ప్రకాశిక:** శ్రీ బులుసు రవి శర్మ
**సాంకేతిక ప్రకాశిక:** శ్రీ యక్కలి రాజేష్

## ప్రకాశిక – ఒక పరిచయం

ఆధునిక కవితకు అడుగుజాడ అయిన మహాకవి శ్రీ గురజాడ వేంకట అప్పారావు గారు తలపెట్టిన పత్రిక **'ప్రకాశిక'**. ఆ పత్రికని పునరుద్ధరించి ఆయన స్మృతికి ఘననివాళి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో **'ప్రకాశిక'** ప్రచురణకి గురజాడ ఫౌండేషన్ (అమెరికా) పూనుకుంది. యావత్ తెలుగుజాతికి అలనాటి భాష, సంస్కృతి, సంప్రదాయం, వ్యావహారికాలను, సమకాలీన సాహితీ ప్రక్రియలను పరిచయం చేస్తూ, నేటి సమాజపు స్థితిగతులకు అద్దంపట్టే రచనలకు ఒక వేదికగా ప్రకాశిక రూపుదిద్దుకుంటోంది. **'ప్రకాశిక'** తెలుగు అంతర్జాల త్రైమాస పత్రికగా వెలువడబోతోంది.

గురజాడ కలం నుండి జాలువారిన అక్షర మాలికలు ఎన్నో. గురజాడ వేంకట అప్పారావు గారికి మహాకవి శ్రీ గురజాడ అప్పారావుగా గుర్తింపు తెచ్చిన ఆయన రచనలు ఆణిముత్యాలు, సరస సరాగాలు, ముత్యాల సరాలు. పరిసరాలని పరిశీలిస్తూ, ప్రభావితమవుతూ, మంచి అన్నది పెంచమంటూ, భాష భావ వ్యక్తీకరణకు సాధనమే కానీ పద డాంబిక ప్రదర్శనకు సూచిక కాదని నమ్మి, తెలుగుభాషని తేటగా, తీయగా, సరళంగా, సరసంగా పండిత పామరులకు చేరువ చేయడంలో ఆయన సలిపిన కృషి అజరామరం, చిరస్మరణీయం.

సాంఘిక దురాచారాలని వ్యావహారిక భాషలో ఎత్తిచూపి, వ్యంగ్యాయుధంతో వాటిని కూకటివేళ్లతో సహా పెకలించిన అరుదైన భాషావేత్త, సంఘ సంస్కర్త మహాకవి గురజాడ వేంకట అప్పారావుగారు. అక్షరాయుధంతో మరెన్నోసాధించాలనుకున్నారో ఏమో, **'ప్రకాశిక'**పత్రికను ఆయన స్థాపించారు. అయితే, ఆ పత్రిక ఎంతోకాలం సాగిన దాఖలాలు లేవు. తొలి రాత ప్రతి దొంగిలించబడిందని ఆయన వంశీకుల ఆవేదన. ప్రకాశిక పత్రిక పరహస్తగతమైనా, అందులోని భావతరంగాలు శతాబ్దానికి పైగా ఎన్నో తరాలను ఉత్తేజపరుస్తూనే ఉన్నాయి.

మహాకవి గురజాడ కాలంలో ఉన్న దురాచారాలు, మూఢ నమ్మకాలు ఈ కాలంలో కూడా ఆధునిక జ్ఞానంతోపాటు, ఏదో ఒక రూపంలో విరివిగా, విస్తృతంగా కొనసాగుతున్నాయి. మనుషులలోని భయాలని, ఆందోళనలని ఆసరాగా తీసుకుని, అరకొర జ్ఞానంతో, శాస్త్రాలకి వక్రభాష్యాలతో అమాయకులని మోసంచేసే నవయుగ గిరీశాలు కోకొల్లలుగా, ఖండాంతరాలుగా వ్యాపించి ఉన్నారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో హేతుబద్ధ ఆలోచనలు పెంచే ప్రయత్నం ప్రకాశిక ద్వారా చేద్దాం. గురజాడ వ్యక్తిత్వ స్ఫూర్తితో, ఆయన ఆలోచనలకు అనుగుణంగా, భాషోద్దీపన, సమాజ శ్రేయస్సులను కాంక్షిస్తూ 'ప్రకాశిక'ని నడపాలని గురజాడ ఫౌండేషన్ (అమెరికా) సంకల్పం.

సమాజాన్నితట్టి, కుదిపి, ఆలోచింపచేసే రచనలూ, వెన్నుతట్టి దారిచూపే దార్శనికుల వ్యాసాలు, మస్తిష్కానికి పదునుపట్టే శీర్షికలతో 'ప్రకాశిక అందంగా ముస్తాబయి మీ ముందుకు వస్తుంది. ముఖ్యంగా, తెలుగు మాండలిక శోభతో వ్రాసిన రచనలని ప్రోత్సహిస్తాం. హాస్యం, వ్యంగ్యం, వెటకారం తెలియని, నచ్చనివాడు తెలుగువాడు కాదేమో అనిపిస్తుంది. కన్యాశుల్కం ఒక ప్రభావిత నాటకంగా నిలిచిందంటే, హాస్యం, వ్యంగ్యం, వెటకారాలని అనుపానంగా పెట్టి నిష్ఠూరాన్నినిబ్బరంగా చెప్పడంవల్లేకదా! హాస్య, వ్యంగ్యభరిత, రచనలు పంపిస్తే కళ్ళకద్దుకొని తీసుకుంటాం.

తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులైన వారితో ఏర్పాటయిన సంపాదక మండలి, ప్రకాశికని అత్యున్నతమైన ప్రమాణాలతో, అధునిక భావజాలంతో మంచి సామాజిక, సాహితీపత్రికగా మలిచేందుకు మార్గనిర్దేశనం చేస్తుంది. కథ, కవిత, వ్యాసం, అనువాద రచన మొదలైన సాహిత్య ప్రక్రియలన్నింటికీ ప్రకాశిక ఒక విలక్షణమైన వేదికగా ఉంటుంది. గురజాడ వారి జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబరు మాసంలో ప్రకాశిక ప్రత్యేక వార్షికోత్సవ సంచికని వెలువరిస్తాము.

'ప్రకాశిక'ను ప్రకాశవంతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దడంలో సాహితీమిత్రులు, రచయితల అండదండలు, సహకారం మాకు సదా అవసరం. 'ప్రకాశిక'లో ప్రచురించమని ప్రసిద్ధ రచయితలకి, కొత్త రచయితలకి ఆహ్వానం పలుకుతున్నాం. ఈ పత్రిక మనందరిదీ. కలిసిపెంచుదాం.

కొవ్వలి గోపాలకృష్ణ

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు